# మూడోమనిషి

"పరుగెత్తు, ప్రాణాలు కాపాడుకో!"

ఆ అరుపు విని మిత్రులిద్దరూ, ప్రాణాలుగ్గబట్టుకుని, మెట్ల పైకి పరుగెత్తారు. ముప్ఫై మెట్లు ఎక్కేసరికి, ఎగశ్వాసతో కుప్ప కూలబడిపోయారు. రొప్పుతూ, పైకి చూశారు. కొండపైనుండి బండలు విరిగి పడ్డాయి.

పదిహేను రోజుల క్రితం వారిద్దరికీ పరిచయమైంది. హైదరాబాదు నుండీ దక్షిణదేశ యాత్రకు బయలుదేరిన బస్సులో వారి ప్రయాణం. ఇద్దరూ అరవయ్యేళ్ళు పైబడిన వాళ్ళే. వరదరాజన్ తమిళుడు. ఉద్యోగరీత్యా జీవితమంతా ఢిల్లీలో గడిపాడు. కొడుక్కు హైదరాబాదులో ఉద్యోగం. కొడుకుని చూడటానికి వచ్చినవాడు, దక్షిణదేశయాత్రకు బస్సు బయలుదేరుతుందని తెల్సి, తన మాతృదేశాన్ని పున:సందర్శించే అవకాశం లభిస్తుందని సంతోషంతో బస్సులో సీటు రిజర్వు చేసుకున్నాడు. ఆయన భార్య పోయి రెండేళ్ళయింది.

రమాకాంతం, సర్కారు జిల్లాల వాడయినా, సికిందరాబాదులో సెటిలయాడు. పిల్లలు ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. భార్యకు కీళ్ళజబ్బు. తను రాలేనంటే, అతనొక్కడే బయలుదేరాడు. 'సఖ్యం సాప్తపదీనం' అన్నారు. ఈ పదిహేను రోజుల్లో వాళ్ళు మంచి మిత్రులయారు. తిరుపతి చివరి మజిలీ. తీర్థయాత్రా బస్సు తిరపతి చేరాక, "పైకి కాలినడకన వెళ్దామ"న్నాడు రమాకాంతం. వరదరాజన్ కూడా అందుకు అంగీకరించాడు. అదృష్టవశాత్తూ ఇద్దరిలో ఎవరికీ ఆర్థరిటిస్ బాధ లేదు. మిగతా సహ ప్రయాణీకులు బస్సులో తిరుమలకు వెళ్తే, వీళ్ళు మెట్లదారి పట్టారు.

రెండు రోజులుగా తిరుమలలో వాన. ఆరోజు పొద్దునే కొద్దిగా తెరపి ఇచ్చింది. నడిచేదారిలో మెట్ల మీదనుండి నీళ్ళు, సన్నగా క్రిందకు జాలువారుతున్నాయి. రెండు కొండలు ఎక్కాక అలుపు అనిపిస్తే, కూర్చుని సేదతీరి మళ్ళా ప్రయాణం సాగించారు. కొండపైకి రోడ్డు వెయ్యటానికి కొండను కొంతమేర తొలిచారు. అక్కడ కొండ రోడ్డు మీదకు పడేట్టుగా వంగి ఉంది. రోడ్డు దాటి పైకి పోతుంది కాలిబాట. ముసురు వానకు

కొండ విచ్చినట్లుంది. చిన్న చిన్న రాళ్ళుగా మొదలై, పెద్ద పెద్ద బండలే రోడ్డు మీదకు పడి, దిగువ కాలిబాట పైకి దొర్లాయి. ఆ హెచ్చరిక వినకపోయినట్లయితే మిత్రుల శరీరాలు నజ్జు నజ్జు అయేవి, ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోయేవి.

రెండు క్షణాలు మాత్రమే ఆ రాళ్ళ వర్షం. మరు క్షణం అంతా సద్దుమనిగింది. రోడ్డు మీదంతా పెద్ద పెద్ద బండలు. ట్రాఫిక్ స్తంభించిపోయింది. బండలు దొర్లిన సమయంలో ఏ వాహనమూ అటుగా వెళ్ళలేదు.

"ఎవరన్నా అరచినట్లు, మన్ని హెచ్చరించినట్లు నీకేమన్నా అన్పించిందా?" అడిగాడు రమాకాంతం.

"ఏమో, చెప్పలేను. నాలోనుండే ఎవరో అరచినట్లనిపించింది."

"అలా అరిచి, మనకు హెచ్చరిక చేసింది ఓ సాధువు. కాషాయపు బట్టల్లో ఉన్నాడు. మన ప్రాణాలు కాపాడాడు. మనిషి మాయమైపోయాడు" అన్నాడు రమాకాంతం, ఒగరుస్తూ, చుట్టూ కలయజూస్తూ.

"నో. ఇట్సె ఉమన్ ఇన్ రాగ్స్ హు హాజ్ షౌటెడ్, 'ఒడుంగళ్, ఒడుంగళ్, ఉయిర్ తప్ప ఒడుంగళ్' విచ్ మీన్స్– రన్ అవే! ఫ్లీ ఫర్ లైఫ్" అన్నాడు విభేధిస్తూ వరదరాజన్.

వరదరాజన్‌కు తెలుగు అర్థమవుతుంది కానీ మాట్లాడలేదు. వాళ్ళ సంభాషణ సాధారణంగా ఆంగ్లంలోనే నడుస్తూ ఉంటుంది.

"అంటే నువ్వా హెచ్చరిక తమిళంలో విన్నావా? నాకు తెలుగులో విన్పించిందది. నువ్వు చూసింది స్త్రీని, నాకు కన్పించింది పురుషుడు. భావానికి భాష లేదు. రక్షకుడికి స్త్రీ, పురుష ప్రసక్తి లేదు. ఇట్స్ ద థర్డ్ పర్సన్ హు ప్రొటెక్టెడ్ అజ్."

"ఎవరా మూడో మనిషి?"

"అతను మనవెంట ఉంటాడన్న జ్ఞానమే మనకుండదు. అతడు మన్ని సర్వదా రక్షిస్తుంటాడనుకుంటాను. ఆఁ, నేను దిక్కు తోచని స్థితిలో ఉన్నప్పుడల్లా నాకు ఓ ఆపన్నహస్తం అందేది. మొదట్లో నేను ఒంటరి ననుకునే వాడిని. క్రమంగా ఆ భావన పోయింది."

"ఎవరిది ఆ ఆపన్న హస్తం?"

"చెప్తాను విను." నడక సాగించారు మిత్రులు. రమాకాంతం చెప్పసాగాడు.

***

ఓ సారి నేను మహా విషాదంలో పడి పోయాను. ఆత్మహత్య తప్ప మరి గత్యంతరం లేదనిపించింది. అందుకే విజయవాడ ప్రకాశం బేరేజీ నుండి దూకి చద్దామనుకున్నాను. మంగళగిరిలో బస్సెక్కి బేరేజీ దగ్గర దిగి కృష్ణ లోకిదూకితే మరి స్వర్గమే.

బస్సెక్కుదామని బస్ స్టాండులో నిల్చున్నాను. నా పక్కన నిల్చున్న మనిషి- అతని వయస్సు ఇదమిద్ధంగా చెప్పలేను - యాభై, అరవై ఉంటాయేమో - "ఎక్కడికెళ్తున్నావ్!" అని అడిగాడు.

నేనేం జవాబు చెప్పలేదు. అయితే సమాధానం రాకపోతే ఊరుకునే శాల్తీ కాదు అది. "ఏందీ బదులు చెప్పవ్! ఇనబడ్లేదా?"అన్నాడు.

"నీకెందుకయ్యా నేనెక్కడ కెళ్తే? నీ పని నువ్వు చూసుకో" అన్నాను, కసర్తున్నట్టే.

"అదేం మాట! నువ్వు మనుషుల్లో ఒకడివి కాదా ఏంది? తిక్క మనిషివి లాగుండావే పైగా కోపం!"

"అవును, తిక్క మనిషినే. నాతో మాట్లాడక!"

అతనేమనుకున్నాడో రెండు క్షణాలు మాట్లాడలేదు.

ఆ తర్వాత, "ఈ బస్సు ఎప్పుడొస్తాదో? ఈలోగా పిల్ల పోతాదో ఏమో?" అన్నాడతను, పైకే ఆలోచిస్తూ.

'ఎవరా పిల్ల! ఆమె పోవాల్సిన అవసరం ఏంటి?' వగైరా సందేహాలు నాకు కలిగాయి కానీ నేనతన్నేమీ అడగలేదు. పోయే మనిషికి ఎవరికి, ఏమయిందన్న కుతూహలమెందకూ?

"పాపం! ఏందో దిగుల్లో ఉన్నట్టుండావు. పద, ఓ టీ తాగి, బీడీ ముట్టించుకుందాం" అన్నాడతను, నా చేయిపట్టి లాగుతూ.

"ఏయ్! నా చేయి వదులు. నీ టీ వద్దు, నీ బీడీ వద్దు. నన్నిలా వదిలెయ్!" అన్నాను ఛీదరించుకుంటూ.

"మొగమాటం మనిషివిలా ఉండావు. ఉండు, నేనే ఓ కప్పు తెచ్చిస్తాను. ఈలోగా ఈ బీడీ ముట్టించు" అంటూ నా చేతిలో ఓ బీడీ కట్టా, అగ్గిపెట్టా పెట్టి, దగ్గరిలో ఉన్న కాఫీ కొట్టు కెళ్ళాడు.

'శనిలా దాపురించాడు. నా చావు నన్ను చావనిచ్చేట్టు లేదు. వీణ్ణించి ముందు తప్పించు కోవాలి' అనుకుంటూ నేను రోడ్డు పట్టాను. ఎక్కువ దూరం పోలేదు. రైల్వే క్రాసింగు దాటానేమో.

నా వెనుకగావచ్చి ఆగిన ఆటో మోతకు, తుళ్ళిపడి తలెత్తాను. ఓ షేరింగ్ ఆటో ఆగింది. అందులోంచి దిగాడు, ఆ శనిగాడు.

"ఏందీ, పారిపోయి వచ్చావు! ఓటల్లో టీ తీసుకొచ్చి చూసినా, నువ్వు అయిపు లేవు. బస్సు రాలేదు. సరేనని ఈ ఆటోలో పడి వచ్చినా. సరేనబ్బా, అట్ల చెప్పకుండ వస్తే ఎట్ల? బెజవాడ దాకా నడుద్దామన్న ఆలోచనే? పద, నేనూ నీతోపాటే వస్తా. నాకూ నడవటమంటే సరదా" అన్నాడతను, నేను కనబడినందుకు మహదానంద పడిపోతూ.

అతన్ని చూడగానే నా వంటికి కారం రాచుకున్నట్లయింది.

"ఎవరు నువ్వు? నావెంటెందుకు పడ్డావు?" అనడిగాను గదమాయిస్తున్నట్టు.

"నా పేరు అనంతయ్య. అంతా 'అనంతం' అంటారు. నువ్వూ అట్లాగే పిలువు. నేను నీ ఎంట పడట మేంది? నాకేం పని లేదా? అక్కడ నీ గొడుగు వదిలేసి వచ్చావు కదా! నీకది ఇద్దామనే ఇక్కడ దిగినా" అన్నాడు గొడుగు నా వైపు చాచుతూ. "ఈ కాలంలో మంచి చేసినా చెడ్డె పోతా వుంది."

"నేనే గొడుగూ వదిలేసి రాలేదు."

"మరి ఇది ఎవర్ది? నీది కాదూ?"

"కాదని చెప్తుంటే వినపట్టంలా? చెవుడా?"

"పోన్లే, నాదే అనుకో, పోయిందేముంది? ఎండలో ఏ మహానుబావుడో మన కోసం వదిలెళ్ళినట్టున్నాడు. దీని కిందకు రా, చల్లగా ఉంటుంది."

కృష్ణలోకి దూకితే ఇంక అంతా చల్లనే! ఈ బతుకే గంట, గంటన్నరలోకి వచ్చింది. ఎండకు దడవాల్సిన పనేముంది!

అతన్ని పట్టించుకోకుండా నామానాన నేను నడవసాగాను.

ప్రారబ్ధకర్మ పట్టి పీడిస్తూనే ఉంటుంది.

"ఏందట్లా మూగనోము పట్టావు! కబుర్లు చెప్పుకుంటూ నడిస్తే, ఇట్టే కాలం గడచి పోతుంది. నేనో పొడుపు కత పొడుస్తా, చేతనయితే ఇప్పు- 'బూమాతకు ముద్దుబిడ్డ,ఆకాశపు జున్నుగడ్డ, రాత్తిరేళ రాచరికం, పగలయితే పేదరికం'- ఏందదీ?"

సమాధానం చెప్తే అతను పెట్రేగి పోవచ్చు. నిజానికి నాకు సమాధానం కూడా తెలియదు. నోరు విప్పితే అతనికి ప్రోత్సాహం కలుగుతుంది. అసలే జిడ్డు! అందుకే నేనేం మాట్లాడ లేదు.

"ఓర్నీ, ఈ మాత్రం తెలీదా? చందమామయ్యా, నెలపొద్దు! పోన్లే, ఇది చెప్పు - 'తెల్లటి పొలములో నల్లటి విత్తులు, చేతితో చల్లటం, నోటితో ఏరుకోటం."

అతనలా పొడుపు కథలు పొడుస్తూంటే, నేనెప్పుడో చదివిన, 'మజ్జిగ'ను ఉద్దేశిస్తూ ఓ కవి చెప్పిన పద్యం గుర్తుకు వచ్చింది.

'శుద్ధకులజాత యొక సతి / యిద్ధరణిన్ దండ్రి జంపి యెసగ విశుద్ధిన్

బుద్ధి పితామహు బొందుచు / సిద్ధముగా తండ్రి గనును చెప్పుడు దీనిన్.'

ఈ పద్యం చెప్పి, పొడుపు విప్పమని అడుగుదామని నోటి వరకూ వచ్చింది. కానీ, నిగ్రహించుకున్నాను. పద్యానికి అర్థం చెప్పాలి, అతనడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. నాకంత ఓపిక లేదు. అందుకే మాట్లాడకూరుకున్నాను.

"ఇదికూడా తెలీదా? 'పుస్తకం.' సరే, ఎంతసేపూ నా మాటేనా, నువ్వు మాట్లాడవా? చదూకున్న మనిషిలా ఉన్నావు, ఏం చదివావేం?"

'ఎందుకూ చదువు? దండగ ! పెద్ద చదువే చదివాను. బతక నేర్పలేని ఆ చదువెందుకూ?'

"ఏదో, వానాకాలం చదువు చదివాలే !"

"ఆ మాటనకు! ఆ ముగం చూస్తంటే తెలవటంలా? పెద్ద చదువే చదివుంటావు!"

'నువ్వు సంతోషపడి పోతే సరా? వాళ్ళు ఊరుకుంటారా. నేను చదువుకున్న మనిషినని, ఏదో గడ్డి తిన్నానని!'

"సర్లే, నువ్వు చెప్పవు గానీ, ఇందాకిచ్చిన ఆ బీడీ కట్టా, అగ్గిపెట్టా బయటికి తీ. ఓ దమ్ములాగుదాం."

"నా దగ్గర్లేవు. ఎప్పుడో పారేశా. నేను పొగ తాగను."

"ఏం మనిషివయ్యా! బతుకులో సగం సుకం నాశనం చేసుకున్నావే ! పోన్లే, కిళ్ళీబడ్డీ వస్తే కొనుక్కుందాం."

నేనేం మాట్లాడలేదు. నా మౌనం అతన్ని నిరుత్సాహ పర్చలేదు. మహా ఉత్సాహ స్రోతస్సు కలిగిన మనిషిలా ఉన్నాడు.

పాట ఎత్తుకున్నాడు.

'యెంకివొంటి పిల్ల లేదోయ్ లేదోయ్। యెంకి నా వొంకింక రాదోయ్ రాదోయ్

మెళ్ళో పూసల పేరు తల్లో పూవులు సేరు। కళ్ళెత్తితే సాలు కనకాబి సేకాలు...'

కాసేపున్నాక, పాట ఆపి, "సర్లే ఇది చెప్పు- ఒక పులిని, ఒక మేకను, ఒక గడ్డిమోపును పడవలో అవతలి వైపుకు తీసుకువెళ్ళాలి ఒక రైతు. పడవలో ఒకసారి ఒక దాన్నే తీసుకెళ్ళగలడు. రెండేసి తీసికెళ్తే పడవ మునిగి పోతుంది. గడ్డిమోపును తీసుకెళితే, పులి మేకను తినేస్తుంది. పులిని తీసుకెళితే, మేక గడ్డిమోపును తినేస్తుంది. ఒకదాన్ని ఒకటి తినేయకుండా అవతల ఒడ్డుకు ఎట్లా వెళ్ళాలి?"

నేను పలకలేదు.

"ఎట్లాగంటే- ముందు మేకను పడవమీద అవతల ఒడ్డుకు తీసుకుని వెళ్తాడు. ఆ తర్వాత పులిని అవతల ఒడ్డున దింపి, మేకను వెనక్కు తీసుకు వచ్చేస్తాడు. మేకను ఇవతలి ఒడ్డున దింపి తర్వాత గడ్డిమోపునుతీసుకుని వెళ్తాడు. పులి గడ్డి కరవదు కదా మరి! ఆ తర్వాత మేకను అవతల ఒడ్డుకు తీసుకెళ్తాడు...."

తోవలో ఏదో కంపెనీ వచ్చింది. అన్నట్లే, అక్కడున్న కిళ్ళీబడ్డీలో బీడీ కట్టా, అగ్గిపెట్టా కొన్నాడతను. తనో బీడీముట్టించి, నాకోటిచ్చాడు. నేను వద్దన్నా వినలేదు. ఓ బీడీ నా నోట్లో పెట్టి, ముట్టించాడు. ఎలా సొగసుగా గాలి లోపలకు పీల్చాలో బోధించాడు. చెయ్యకూడని తప్పుడు పని ఓ సారి చేశాక, ఇంక నేను దేనికైనా సిద్ధమేననిపించింది. బీడీ పొగ బాగానే ఉన్నట్లనిపించింది. ఓ సారి దగ్గు వచ్చింది.

"బయపడకు. అలవాటయి పోతుంది" అని అతను భరోసా ఇచ్చాడు.

"నీకు పెళ్ళయిందా? అయ్యే ఉంటదిలే. ఎంతమంది పిల్లలు?" అడిగాడతను.

నేను మాట్లాడలేదు.

"నువ్వు మాట్లాడవు. పోన్లే. నాకో కూతురు. బతుకు మనమనుకున్నట్టు సాగదు. ఓ పాలేమైదంటే, మా ఇంటికి నా పెండ్లాం బావనంటూ ఓ మనిషొచ్చాడు. అప్పటికి మా పెళ్ళయి మూడేళ్ళుకూడా నిండలేదు. మాకు ఏణ్ణర్ధం వయసున్న కూతురు. 'నీ పెండ్లికి నేను రాలేక పోయినానే' అంటూ, డబ్బు బాగా కర్చుపెట్టి, బారీ సారె తీసుకొచ్చాడు. నాకూ, నా పెండ్లానికీ ఆడంటే మంచి అబిప్రాయం ఏర్పడింది. ఆ తర్వాత వచ్చినప్పుడల్లా ఏవో కానుకలు పట్టుకు వచ్చేవాడు. మొదట్లో నెలకోతూరి వచ్చేవాడు, ఆతర్వాత వారం వారం రావటం సాగించాడు. నా పెండ్లాం ఆడంటే పెద్ద బ్రమలో పడి పోయింది. నేను పెద్ద చవటలా కనిపించ సాగాను దానికి. ఉన్నట్లుండి ఓ నాడు అది వాడితో లేచి పోయింది..."

"మరేం చేశావు?" అడిగాను, కుతూహలం పట్టలేక.

"మొదట్లో ఆళ్ళని ఎతికి పట్టుకుని నరికి పారేద్దామనిపించింది. రెండు, మూడు నెల్లు తిండీ తిప్పల్లేకుండా ఎతికినా కూడా. ఆనక ఆవేశం చల్లారినాక, నాకన్పించింది – తప్పు నా దగ్గర పెట్టుకుని ఆళ్ళననటమెందుకని."

"నువ్వేం తప్పు చేశావు?"

"ఆడు తెచ్చే కానుకల్ని నేను మొదట్లోనే కాదంటే, ఇంత ఆపత్తు వచ్చుండేది కాదు. ఇంట్లోకి వస్తువులు, డబ్బు వస్తోంది కదా అని సంబర పడ్డా కానీ, కొంప ముంచుతున్నాడన్న ఆలోచన నాకు రాకుండె. నా పెండ్లాం అమాయకప్పక్షి! ఆడు కంత్రీవోడు. ఇప్పుడు ఆడ్నీ, దాన్నీ చంపి పెయోజన మేంది? ఈడ నా పిల్ల అనాద అయిపోతాది......"

అంతలో తాడేపల్లి వచ్చింది. "దా, అట్టా కూచ్చుని ఆ ఓటల్లో టీ తాగుదాం రా" అని చెయ్యి పట్టుకుని నన్ను ఓ కాకా హెూటల్లోకి తీసుకెళ్ళాడు. వద్దన్నకొద్దీ ఓ ప్లేటు పకోడీకూడా తినిపించాడు.

"తినబ్బా! మొగమాట పడతావేంది? నీ అయ్యే అనుకో. నా వయసు ఎంతను కుంటున్నావేంది? డెబ్బై రెండు."

ఇంక నేను మొహమాటం వదిలేశాను. హెూటలు బయట అరుగుమీద కూర్చుని అతనిచ్చిన బీడీ ముట్టించాను. ఆ సమయంలో నా కొలీగ్స్, సబార్డినేట్స్‌లో ఎవరన్నా చూస్తే వాళ్ళ మతిపోయి ఉండేది.

"ఇహ బయలుదేరదామా?" అన్నాడు అనంతయ్య.

"ఎక్కడికి?"

"అదేనయ్యా, నువ్వు ఎళ్ళదల్చుకున్న చోటికి!"

బయలుదేరాం. బతుకు పయనంలో ఎక్కడా ఆగటానికి వీలులేదు. బస్సు ఎక్కి వెళ్ళాలన్న ఆలోచన మాలో ఎవరికీ కలుగలేదు. అనంతయ్య ఏదో చెప్తున్నాడు. అతను చెప్పే మాటలు నా చెవిన బడలేదు. అచ్చంగా నేనూ ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నానప్పుడు. విజయవాడ లోని ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖకు అధికారిని నేను. సిటిఓ అంటారు. నిక్కచ్చి మనిషినినని నాకు పేరు. లంచం ఇచ్చి పని జరిపించుకోవాలని చూసే మనుషుల పట్ల నేను కఠినంగా ప్రవర్తించేవాడిని. నా క్రింది అధికారి చలపతి–ఎసిటివో– నన్ను, నా నిజాయితీని మెచ్చుకుంటూండేవాడు. ఎవరైనా మెచ్చుకుంటే సంతోషపడి పోవటం

నా బలహీనత. దాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం నాకు చాల కాలం దాకా కలగలేదు. ఇప్పుడు కలిగీ ప్రయోజనంలేదు.

ఓ సారి నా కొడుకు పుట్టిన రోజున అతన్ని ఆహ్వానిస్తే, కానుకంటూ చాలా ఖరీదయిన ఉంగరం తీసుకు వచ్చాడు. ఏ వందో, రెండు వందలో పెట్టి తీసుకు వస్తే అభ్యంతర పడాల్సిన అవసరం ఉండదు. కానీ ఇది రెండు, మూడు వేలయినా అవుతుంది. డబ్బు పాపిష్టిది అనుకుంటాం. కానీ మనిషి మనసు పాపిష్టిది. బతుకు హాయిగా గడపగలిగే జీతం వస్తుంది నాకు. ఇలాంటి కానుకల ప్రలోభం నా కుండకూడదు. పిల్లవాడి పుట్టినరోజు కానుక అని నేను మనసుకు నచ్చ చెప్పుకున్నాను.

మరోసారి, "చాలా చీప్‌గా వస్తోంది, గురూగారూ! డీలర్ మనకు తెల్సినవాడే" అంటూ, నేనడక్కుండానే, ఓ పెద్ద కలర్ టి.వి. తెచ్చి పెట్టాడు ఇంట్లో. అది చూసి మా ఆవిడ ఎంతో ముచ్చటపడి పోయింది. ఆమె సంతోషం చూసి నేనేమన లేక పోయాను.

"ఇప్పుడు ఎంత కట్టాలయ్యా!" అని అడిగాను.

"దాని కిప్పుడు వర్రీ కాకండి, గురూగారూ! నేను చూసుకుంటాగా" అన్నాడు.

అతనే చూసుకున్నాడు. నేను పైస ఇచ్చింది లేదు. ఆ రోజుల్లోనే ఇరవై వేలు చేసే టి.వి. అప్పనంగా వచ్చి ఇంట్లో పడింది. అలా అలా వస్తువులు వచ్చి ఇంట్లో పడుతున్నాయి. ఏ కొత్త గాడ్జెట్ మార్కెట్‌లోకి వచ్చినా, ఫోను చేసి, "హలో చలపతి గారూ! కొత్తగా మార్కెట్‌లోకి మిక్సీ వచ్చిందంట! ఆయన డబ్బులిస్తారు. తెప్పించి పెట్టండి" అని చెప్పేది మా ఆవిడ. ఆరోజు సాయంత్రానికల్లా వస్తువు వచ్చి మా ఇంట్లో వాలేది. మొదట్లో "ఎంతయిందయ్యా?" అని మాటవరుసకడిగేవాడిని. ఆ తర్వాత అదికూడా మానుకున్నాను.

మా మధ్య చనువు బాగా పెరిగింది. మొహమాట పెట్టి ఫైళ్ళపై సంతకాలు చేయించే స్థాయికి పెరిగింది. అందుకు ఫలితమేమిటో నాకు తెలియక పోలేదు. తెలిసినవాళ్ళకు, మొహమాటస్థులకు సాయం చేస్తున్నాడనుకున్నా కానీ, ఈ చనువును దుర్వినియోగం చేస్తున్నాడనీ, డబ్బుచేసుకుంటున్నాడనీ భావించలేదు. సాన్నిహిత్యం కళ్ళపై పొరలు కమ్మేట్టు చేస్తుంది.

నాలుగు రోజుల క్రితం మా అక్కకు ఒంట్లో బాగాలేదని తెలిస్తే, చూసి రావాలని మద్రాసు (ఇప్పటి చెన్నై) వెళ్ళాను. వెళ్ళిన మర్నాడు, నా స్టెనో రామారావు నాకు ఫోను చేసి చెప్పాడు– "చలపతి గారు లక్ష రూపాయలు లంచం పుచ్చుకుంటూండగా యాంటీ కరప్షన్ వాళ్ళు రెడ్ హాండెడ్‌గా ఆయన్ని పట్టుకున్నారు. వాళ్ళ ప్రశ్నలకు జవాబు చెప్తూ,

మీరు పెద్ద కరప్ట్ ఆఫీసరనీ, మీ బలవంతం వల్లనే తనకు లంచం పట్టక తప్పటం లేదనీ, అందులో సింహ భాగం మీకే సమర్పించుకోవాలనీ చెప్పాడు. ఒకటి, రెండు రోజుల్లో మీ ఇంటి పైనా రైడ్ చెయ్యొచ్చని అంటున్నారు" అని. రామారావు నమ్మకస్థుడు. అతను మా ఊరివాడు.అతని మాట విశ్వసించక తప్పదు. ఇంటిమనిషిలా మెసలుకునేవాడు.

మా అక్క పరిస్థితి అంత బాగా లేక పోయినా నేను మద్రాసులో ఉండలేక పోయాను. విజయవాడకు బయలు దేరాను. ట్రయిను తెనాలి చేరేసరికి మధ్యాహ్నం మూడయింది. విజయవాడ వెళ్ళబుద్ధి పుట్టలేదు. నా కళ్ళ ఎదుటే నా ఇంటిని వాళ్ళు సోదా చేస్తూవుంటే నేను భరించలేను. మంగళగిరిలో నా సన్నిహిత మిత్రుడున్నాడు. ఆ ఊరి హైస్కూలులో మేమిద్దరం కల్సి చదువుకున్నాం. వాడు నన్ను సాదరంగా ఆహ్వానిస్తాడు. తెనాలిలో దిగి బస్సులో మంగళగిరి వచ్చాను. అయితే, బస్సు దిగాక వాడింటికీ వెళ్ళబుద్ధి కాలేదు. వాడికి నా పరిస్థితి గురించేం చెప్పగలను. అక్కడ నుండి పారిపోవాలనిపించింది. పరువు పోకుండా కాపాడుకోవాలంటే ఈ లోకాన్నుండే పారిపోవాలి.

ఇప్పుడింత ఆదరించే మిత్రులు, బంధువులు రేపు నేను లంచగొండినని నిర్ధారణ అయ్యాక, ముఖం చాటేయరనేమున్నది. నా పెళ్ళాం, పిల్లలు నోటితో ఏమనక పోయినా, చూపుల్తో నన్ను దోషిగా నిలబెట్టవచ్చు. అత్తమామలకు తల్లిదండ్రులకు నేను మొహమెలా చూబెట్టగలను. అందుకే ఈ అంతిమ ప్రయాణం. బస్సు దొరికితే అరగంటలో విజయవాడలో ఉండవచ్చు. అలా ఓ గంటసేపు వీధుల్లో తిరిగితే చీకటి పడుతుంది. బారేజీ కొచ్చి కృష్ణలో దూకేస్తే, ఇంకపరువు ప్రతిష్ఠల ప్రసక్తి ఉండదు...

"ఏందయ్యోవ్? ఎక్కడున్నా? నా మాటలు చెవిన బడ్డాయా?" అని అనంతయ్య అరిచేటప్పటికి నేను ఈ లోకంలో పడ్డాను.

"నీ మాటలు వినకపోటమేంటి? అప్పుడేం చేశావు?"

"ఎప్పుడు?"

"నీ భార్య వెళ్ళిపోయాక!"

నవ్వాడు అనంతయ్య.

"మొగమాటమెందుకు- లేచి పోయిందనటానికి!"

"సర్లే, చెప్పు."

"చద్దామనుకున్నాను. సరే, నీకు దేవుండంటే నమ్మకమేనా?"

నేను అప్పటిదాకా 'ఎగ్నాస్టిక్'ని – దేవుఁడి అస్తిత్వం తెలుసుకోటం కష్టమనుకునే మనిషిని. ఆమాట అతనికెలా తెలియచెప్పాలో నా కర్థం కాలేదు.

"ఏమో నాకు తెలియదు" అన్నాను.

"ఏం మనిషివయ్యా! నమ్మకముందంటే ఉందనాలి, లేకుంటే లేదనాలి. ఆ కష్ట సమయాన దేవుఁడు నా కాడ కొచ్చాడు."

"ఎవరూ, దేవుఁడా?"

"మా నాయన. మరి దేవుఁడెట్లా వస్తాడనుకున్నా? మనిషి రూపంలోనే వస్తాడు. మా నాయనకు, నాకు ఎప్పటినుండో పడేది కాదు. ఎకరం పొలం అమ్మి చెల్లి పెళ్ళికని డబ్బు ఇంట్లో పెడితే, నేనది ఎత్తుకెళ్ళి సర్దాలకి అరతికర్పూరం జేసినా డబ్బు అయిపొయ్యాక ఇంటికెళ్తే, తిట్టి ఎళ్ళగొట్టాడు. అప్పుడు మనం మకురుగొడ్డులా ఉండేవాళ్ళం లే. నేనాయన్ని తిరిగి కొట్టబోయినా. పక్కనున్నోళ్ళు పట్టుకుని ఆపి నన్ను బయటికి పంపారు. పదిహేనేండ్లు ఆయన నా ముగం చూసింది లేదు. ఎట్లా తెలిసిందో– వచ్చాడు మా నాయన, ఏ లోకానున్నాడో, పాపం! 'సచ్చి ఏం సాదిస్తావు రా ఎదవకాన! బతకటం మొగతనం రా' అని నాకు ఇతవు బోదించాడు. 'ఇంత నగుబాటయ్యాక బతికేం లాబం. ఈదిలో తలెత్తుకో లేని బతుకయినాది' అన్నాను. 'ఎన్ని అవమానాలు బరించయినా బతకాలిరా, కొడకా! చచ్చేవోడు పిరికోడు. కొయ్య గుఱ్ఱం ఎగరా వచ్చు. ఇప్పటి నగుబాటు బతుకు, రేపు కాగడాలా ఎలుగు నింపే బతుకూ కావచ్చు. ఈ బొంది పోయాక, తరవాత ఉందేదేందో ఎవరికీ తెలవదు. కనుక బతకాల' అని చెప్పాడు మా నాయన దేవుఁడు. నన్ను చావనివ్వ లేదు. నేను బతుకుతానన్న దీమా కలిగిందాకా నన్నిడిచి పెట్టి ఎళ్ళలేదు. ఆపైన, పిల్ల గుదిబండలా వుండె. తల్లిలా నేను దాన్ని వదిలెయ్యలేక పోయాను. అవమానాలు పడ్డాను. ఇయ్యాల అదీ లేదు. దానికి నేనంటే ప్యాణం..."

ఓ బీడీ ముట్టించి, నాకొకటి ఇచ్చాడు.

"ఏ పనయినా బాగా ఆలోచించి చెయ్యాలి. ఆవేశంలో ఆళ్ళని మట్టుపెట్టి ఉండేవాడిని. అట్టాంటప్పుడే మూడో మనిషి అవసరం ఉంటుంది...."

నా బుఱ్ఱలో గంటేదో మోగింది. 'ఎక్కడిదీ ఆలోచన? భారవి– సహసా విదధీత న క్రియాం–?'

"మూడో మనిషి ఎవరు?" అడిగాను.

"బుద్దున్నోడు. ఇద్దరు కొట్టుకు ఛస్తున్నారు. ఆవేశంలో బుర్ర పని చెయ్యదు. ఒకడు చస్తాడు, ఇంకోడు జైల్లో పడతాడు. పెళ్ళాం, మొగుడు కీచులాడుకుంటున్నారు. ఇడిపోతారు. ఇట్టాంటి సందర్భాల్లోనే మూడోమనిషి అవసరం. ఆడే దేవుండి ప్రతినిది. ఆడే మనకు తెలీకుండా మన ఎంటే ఉంటాడు. కష్టాల్లో మనకు సలా ఇస్తుంటాడు కానీ మనమే ఇన్పించుకోం."

నడస్తూ మేం ప్రకాశం బేరేజీ దాకా వచ్చాం.

"నేనో మాట చెప్తా- ఇంటావా?" అడిగాడు అనంతయ్య.

"చెప్పు"

"చీకటి పడ్తావుంది. ఇప్పుడు బెజవాడెళ్ళేం చేస్తాం?"

నా బుర్ర పోయినట్లుంది. "మరేం చేద్దామంటావు?"

"నా మాటినుకో. ఇయ్యాల రేత్రికి సీతానగరంలో ఉందాం. రేపు బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నాక నీతోవ నీది, నాతోవ నాది."

నాకు స్వంతంగా ఆలోచించుకునే మనస్థితి లేదు. చావటానికెప్పుడైతేనేం- ఇవాళయినా, రేపయినా ఒకటే! అతను చెప్పినట్లే అతని వెంట బయలుదేరాను.

అతను సీతానగరంలో ఓ ఇంటికి తీసుకెళ్ళాడు. తలుపు తాళం వేసి ఉంది. "పిల్లది ఎళ్ళిపోయినాది. మొగుడు వచ్చుంటాడు. నే వచ్చాక వెళ్ళవని చెప్పాను. పోన్లే పోనీ, ఎవరి కోసం ఎవరెందుకాగాలి?" అన్నాడు తలుపు తాళం తీస్తూ.

"ఎవరు- నీ కూతురా?" అడిగాను నేను.

"మనమరాలు! కూతురు కూతురు. నా కూతురు దీన్ని కనటం కష్టమై చచ్చి పోయింది. దీన్ని సాకమని నా చేతిలో పెట్టి పోయింది.... ఆకలేస్తాఉందా? అన్నం పడేస్తా."

"ఇప్పుడేం తొందరలేదు. ఓ బీడీ ఇవ్వు, తాగుదాం" అన్నాను. అతన్నేమడగటానికీ సంకోచం కలగటంలేదు.

నాకు బీడీ కట్ట, అగ్గిపెట్ట ఇచ్చి, అలమారులో వున్న తేగలకట్ట తీసుకుని, "పద, కృష్ణ ఒడ్డున కూర్చుందాం" అన్నాడు. కొంత దూరం పోయాక, "అదుగో, కనిపిస్తా వుండ్లా, ఆ తిన్నె మీద కూర్చో. నేనిప్పుడే వస్తా. ఈ తేగలు నీతో పట్టుకెళ్ళు" అంటూ పక్క వీథిలోకి తిరిగి మాయమయ్యాడు.

నేను బీడీ ముట్టించి నడవసాగాను. పైన గుళ్ళో కొబ్బరి చిప్పలు తినటానికి అలవాటు పడిన కోతొకటి తేగలకోసం నా వెంట పడింది. అది తేగల కెలా అలవాటు పడిందో? నేను దాన్నుండి తప్పించుకోటానికి పారిపోసాగాను. అది నా వెంట పడ పాగింది. నేను వేగం పెంచిన కొద్దీ అదీ వేగం పెంచింది. క్షణంలో అది నా మీదకు లంఘించి నా చేతిలోని తేగల నందుకునేదే. అంతలో అనంతయ్య ఎక్కడనుండో ఊడి పడ్డాడు. రాయి తీసి విసరే సరికి అది తోకముడిచి పారిపోయింది.

"తేగలు చూస్తే వదలి పెట్టదది. నేనే అలవాటు జేసినా" అన్నాడు అనంతయ్య నవ్వుతూ.

నదికి సమీపాన ఇసుక తిన్నె మీద తిష్టవేశాం. మాఘమాసం చివరి రోజులు. ఎండలు మాడ్చటం మొదలెట్టాయి. బేరేజి నుండి పెద్దగా నీళ్ళు వదలటం లేదు. స్నానం చేద్దామనిపించింది. కానీ, కట్టుకునేందుకు బట్టలు లేవు.

కూర్చున్నాక, సంచీలోనుండి రెండు సారా సీసాలు తీశాడు అనంతయ్య. ఇంకా కూడా ఉన్నయ్యి సంచీలో.

వాటిని చూస్తూనే, "నాకలవాటు లేదు. నువ్వు తాగు" అన్నాను.

"తాక్కుండా అలవాటెట్టవుద్దీ? ముందో గుటకేసుకు చెప్పు. ఆ తర్వాత మాట్లాడుకుందాం."

ఇంక నేనతనితో వాదించదల్చుకోలేదు. రేపు చచ్చేవాడికి నీతి నియమాలేమిటి? అన్నీ తినాల్సిందే, తాగాల్సిందే. అతని చేతుల్లోనుండి సీసాలాక్కుని రెండు గుటకలేశాను. తేగల నంజుడు, సారా పానీయం. మహ రంజుగా ఉందిలే. బాటిల్లో ముప్పావు భాగం పూర్తయింది. ఇంక కబుర్లు మొదలయ్యాయి. నేనేం చెప్పానో నాకే తెలీదు.

"సమస్య లేందయ్యా, కోతుల్లాంటివవి. నువ్వు పారిపోతుండే కొద్దీ నీ ఎంట బడ్తాయి. రాయి తీసుకు ఎదురు తిరుగు. పారిపోతయ్యి. ఇందాక కోతి కాలికి బుద్ది చెప్పలా? నిజానికవి సమస్యలా అని కూడా ఆలోచించం మనం!"

నేనేం సమాధానం చెప్పానో నాకు గుర్తు లేదు. అతనేదో చెప్తూనే ఉన్నాడు. సీసాలమీద సీసాలు తాగాం. మగత కమ్మేదాకా తాగాం. ఆ తేగలే ఆ నాటి మా ఆహారం. ఒళ్ళు తెలియకుండా తిన్నాం, తాగాం. మత్తెక్కి ఆ ఇసుక తిన్నెల మీదే పడి నిద్ర పోయాం.

మర్నాడు నిద్ర లేచే సరికి బారెడు పొద్దెక్కింది. నేను లేచి కూర్చున్నాను. అనంతయ్య నదిలో స్నానం చేస్తున్నాడు. "లేచావా! చూడు. పక్కన పందుం పుల్ల ఉంది. మొగం కడుక్కో. తువ్వాలు తీసుకుని స్తానం చెయ్యి. పాణం లేచొస్తాది. లే, లే" అన్నాడతను.

బతుకులో అంతా తీరికే. ఆఫీసుకెళ్ళే పని లేదు. పందుం పుల్లతో పళ్ళు తోముకుని, టవలు కట్టుకుని నదిలోకి దిగాను. ఒళ్ళు జివ్వుమంది. స్నానంలోని సుఖాన్ని అంతలా నేనెప్పుడూ అనుభవించలేదు. వేరే బట్టలు లేవు. మద్రాసు నుండి తిరిగి వచ్చేటప్పుడు నాతో తీసుకు వచ్చిన సూట్‌కేసును మర్చిపోయి దిగేశాను. మంగళగిరి బస్సు ఏక్కాక గానీ దాని సంగతి గుర్తుకు రాలేదు. బతుకే అనిశ్చిత మైనప్పుడు పోయిందాన్ని గూర్చిన బాధ నాకు కలగలేదు.

స్నానం చేసి విప్పిన బట్టల్ని ఉతుక్కున్నాను. తడి టవలు కట్టుకుని బట్టలు ఆరవేసుకున్నాను. ఆరాక బట్టలు వేసుకునే సరికి, గట్టుమీదనుండి అనంతయ్య అరుస్తున్నాడు, "ఏమయ్యోవ్! అక్కడే ఉండి పోతావా? తిండీ తిప్పలక్కర్లేదా?" అని.

వాచీ చూసుకున్నాను. పన్నెండు గంటలయింది. చిత్రం! పెరిగి, బుద్ధెరిగాక, ఉదయం కాఫీ తాగకుండా ఇన్ని గంటలుండటం ఇదే ప్రథమం! తలనొప్పి కూడా రాలేదు.

ఇద్దరం కల్సి అతనింటికెళ్ళాం. క్రితం రాత్రి ఆ ఇంటిని నేను గమనించలేదు. నిప్పచ్చరం అలుముకు ఉంది. కానీ, ఇల్లు పరిశుభ్రంగా, పవిత్రంగా కన్పించింది. అక్కడ నీచత్వానికి, అల్పత్వానికి తావులేదు. చిత్రంగా అతని భాషలోనూ మార్పు కొట్టొచ్చినట్లు కనపడింది. అతనిదిప్పుడు గ్రామ్య భాష కాదు.

అరిటాకులో అన్నం వడ్డించాడు. అరటికాయ కూర, పప్పుచారు, మజ్జిగ వ్యంజనాలు. స్పార్టన్ సింప్లిసిటీ!

"ఈ పంచె కట్టుకో, భోజనం చేద్దాం. అది లేచిపోయాక నేను మళ్ళా పెళ్ళి చేసుకోలేదు. తప్పుడు కొడుకు! నాలుగేళ్ళు వాడుకుని వదిలేశాడు. పుట్టింటి కెళ్ళింది. నాయన తన్ని తగలేశాడు. తప్పక నా దగ్గరకు వచ్చింది. నే నెళ్ళమంటే దానికి కిష్టమ్మే గతి. అవమానం పాలై బతుకు అంతం చేసుకునే దౌర్భాగ్యం ఎవరికీ పట్టకూడదు. నేను దాన్ని ఆ ఆపత్తు నుండి కాపాడదామనుకున్నాను. నాతో ఉండమన్నాను. శరీరంతో ఉంది. నాకు అది చేసిన ద్రోహం దాన్ని లోలోపల నుండి హరించేసింది. యేడాది గడవకముందే చచ్చింది..."

భోజనం చేస్తున్నాం. అక్కడ మొహమాటపడటానికీ, సిగ్గుపడటానికీ అస్కారం లేదు. అతనికి తన సొమ్మేదో పెడుతున్న భావన లేదు. ఉన్నది తింటానికీ, వాడుకోటానికీ అందరికీ హక్కుంటుందన్నట్టు ప్రవర్తిస్తాడతను. అది నీదా, నాదా అన్న భావన లేదు.

"నిజానికి మనిషికి మరణమంటే భయంలేదు. దుఃఖమన్నా, బాధ అన్నా భయం అతనికి. ఉన్నది పోతుందేమో నన్న భయం.... అసలు ఈ భయానికి మూలమెక్కడంటావు?" అడిగాడు అనంతయ్య.

"నువ్వే చెప్పు."

"నువ్వే! నీ గురించి నువ్వు ఆలోచిస్తున్నప్పుడే అన్ని భయాలూ, ఆందోళనలూ. నీ కేమవుతుంది అన్న చింత నిన్ను నిరంతరం దహించి వేస్తుంది.... చాలా కాలం ఆ వహ్నిలో దగ్ధమయాక, నాకు తెల్సింది. నా చుట్టూ పెద్ద ప్రపంచం ఉందనీ, ప్రతి మనిషీ తనే ఓ ప్రపంచమని భావిస్తాడనీ, భ్రమలో భ్రమిస్తాడనీ తెల్సుకున్నాను. మా నాయన కేమీ తెలియదని నేను అనుకుంటూ ఉండేవాడిని. ఆయన తన ఇంటికి వెళ్ళిపోతూ చెప్పాడు......"

తండ్రి స్మరణలో అతను తన్ను తాను మర్చిపోయాడు.

నేనడిగాను,"ఏమని?" అని.

"'దాన్ని వెతికి పట్టుకుని బతిమిలాడి, బామాలి ఇంటికి తెచ్చుకోవాలని నీ ఆలోచన. అది భ్రమలో ఉంది. నువ్వు పిల్చినా రాదు. భ్రమ తొలగినప్పుడు లేక ఆడు తన్నితగ లేసినప్పుడు తిరిగి రావొచ్చు. మితి మీరిన ఆభిజాత్యమున్న దయితే బతుకునంతమూ చేసుకోవచ్చు ఎప్పుడో రావచ్చు. అప్పటికి నీకు దానిపై పాత స్నేహం లేక పోవచ్చు, ఆమె అవసరమూ లేక పోవచ్చు. అయితే, దరికి వచ్చింది కదా అని చులకనచేసి తృణీకరించకు. దగ్గరకు తీస్తే లోకులు కాకుల్లా పొడుస్తారని భయపడి పారిపోకు. సమస్య నుండి పారిపోవటమంత దౌర్భాగ్యం బతుకులో మరొకటిలేదు........' అని. దాన్ని తిరిగి తెచ్చుకోవాలన్న ఆలోచన నాకు అప్పటికి లేదు. దానిమీద కోపం పోలేదు నాకు. అందుకే మా నాయన మాటలకు మౌనం వహించాను నేను. అప్పుడు ఆయనో కథ చెప్పాడు నాకు...."

నేను ఏమిటని అడగక ముందే అతను చెప్పటం ప్రారంభించాడు.

"పదిమంది స్నేహితులు పొరుగూరికి ఎళ్తూంటే, చెట్లుకూల్చే గాలితో, ఉరుములు మెరుపులతో తుఫాను మొదలయింది. అంతా భయంతో ఓ గుడిసెలో తల దాచుకున్నారు. కానీ గుడిసెపై పిడుగు పడితే....? ఆ ఆలోచనతో అందరి గుండెలు జల్లు మన్నాయి...."

"మనలో ఎవడో పాపాత్ముడు ఉన్నాడు. ఆడిని బయటకు పంపేస్తే, మనం బతికి బట్టకట్టొచ్చు అన్నాడు ఆ స్నేహితులలో ఒకడు".

"ఎవరు పాపాత్ములని వారిలో వారు తర్కించుకున్నారు. ఆళ్ళల్లో ఒకడు 'మనిషి అన్నాక పాపం చెయ్యనోడెవడు? మనం అందరం ఏదో పాపం చేసేఉంటాం' అన్నాడు.

"'వీడు పాపిష్టి వెధవ! అందుకే మనం పాపం చేశామంటున్నాడు. వీడిని బయటకు తోలేస్తే మనం బతికి పోతాం' అన్నాడు ఇంకొకడు".

"స్నేహితులంతా అతడే పాపాత్ముడని నిర్ణయించి బలవంతంగా ఆ కుండ పోత వర్షంలో బయటకు గెంటేశారు. ఆడు చేసేది లేక వర్షంలో తడుస్తూ, వణికిపోతూ సమీపంలోని చెట్టుకింద తల దాచుకున్నాడు. ఇంతలో ఓ పిడుగు పెద్ద శబ్దంతో గుడిసెపై పడింది. కలకాలం బతకాలనుకున్న మిత్రులంతా భస్మమయ్యారు. పాపిష్టి మనిషి మాత్రం బతికి బయటపడ్డాడు......నువ్వు ఆలోచించుకు చెయ్యి అని చెప్పాడు మా నాయన."

సాయంత్రం కృష్ణలో గంటల తరబడి ఈదాం. నేను జీవితంలో ఎప్పుడూ అనుభవించని హాయిని అనుభవించాను. మర్నాడు పొద్దున లేచి, "వెళ్దామా?" అన్నాడతను. నేను తల ఊపాను.

ఇద్దరం కల్సి బయలుదేరాం. తోవ పొడుగూతా అతనేదో చెప్తూనే ఉన్నాడు.

"ఏంవిటో, విపరీతమయిన తపన! మనిషికి లేని దేముంది! ఎంత ఉన్నా ఆబగా పోగేసుకుందామన్న తపనే, మనిషిని ప్రమాదాల్లోకి లాగేస్తుంటుంది. కళ్ళకు చేతులడ్డం పెట్టుకుని చీకటిగా ఉందని ఏడిస్తే ఎలా?......"

బస్సెక్కి కనకదుర్గమ్మ గుడి మెట్ల దగ్గర దిగాం. అమ్మను దర్శించుకున్నాం. అమ్మ ప్రశాంతంగా ఉంది. ఆ మాటే అన్నాను అనంతయ్యతో. అతను నవ్వాడు.

"అమ్మ ఎప్పుడూ ఒకటిగానే ఉంటుంది. నీ మనసే ప్రశాంతంగా ఉంది" అని చెప్పాడు.

ఇంక తిరిగి రాబోతుంటే నా స్టెనో రామారావు కన్పించాడు. అతను నన్ను చూసి సంతోషపడిపోయాడు.

"మీకు మద్రాసుకు ఫోను చేశాను. మీరు వెళ్ళిపోయారని చెప్పారు. అరెష్టయి, అవమానం పాలయిన చలపతిరావు గారు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రాణం పోయే ముందు, తన్ను కాపాడుకునేందుకు మిమ్మల్ని ఇరికించ ప్రయత్నించాననీ మేజిస్ట్రేటు ఎదుట మరణ వాగ్మూలమిచ్చాడు. అవినీతి నిరోధక శాఖవాళ్ళు మీ ఇంటిపై రైడ్ చెయ్యాలన్న ఆలోచనను విరమించుకున్నారు. మీరెక్కడికి పోయారా అని మీ ఇంట్లోవాళ్ళు గాబరా పడి పోతున్నారు. మొన్న పొద్దుననగా మద్రాసులో బయలు దేరినవాళ్ళు ఓరోజల్లా ఏమయ్యారా అని దిగులు పడ్డారు మీ భార్య...." అని చెప్ప సాగాడతను.

అతని మాటలు నాకెంతో రిలీఫ్‌నిచ్చాయి.

రైడ్ గురించి నేనేం పెద్ద గాబరా పడలేదన్నట్లు ధ్వనింపచేస్తూ, "మా బాబాయి గారింటి కెళ్ళాలే. నువ్వేమిటీ, ఇలావచ్చావు? కనకదుర్గమ్మను దర్శించుకోటానికి వచ్చావా?" అని అడిగాను.

"మీ కెలా ఉందోకానీ, ఈ కేసు తేలిపోవటంతో నా మనసు తేలికయిపోయింది. మీ లాంటి మంచి మనిషి ఇలాంటి తప్పుడు కేసులో ఇరుక్కోటం నా కెంతో బాధ కలిగించింది. మీరు బయటపడాలని అమ్మకు మొక్కుకున్నాను. మొక్కు తీర్చుకోటానికే వచ్చాను. మీరూ రండి, వెళ్దాం" అన్నాడతను.

"నువ్వు వెళ్ళిరా, మా బాబాయి గారు కూడా నాతో వచ్చారు. మేమిద్దరమూ ఇక్కడ నీకోసం వెయిట్ చేస్తాం" అన్నాను అతనికి నా పట్లవున్న ప్రేమకు చలించిపోతూ.

"ఎక్కడా మీ బాబాయి గారు?" అడిగాడతను.

"ఇక్కడే!" అంటూ పక్కకు తిరిగాను.

అక్కడెక్కడా అనంతయ్య లేడు. ఆ ప్రాంతమంతా వెతికి చూశాం. అతను కన్పించ లేదు. ఆరోజే కాదు, మరెప్పటికీ కన్పించలేదు.

రెండు రోజుల తర్వాత సీతానగరం వెళ్ళానుగానీ ఆ ఇల్లూ కన్పించలేదు, ఆ మనిషీ దొరకలేదు.

నీలాల కృష్ణమ్మ నన్ను చూసి అమాయకంగా నవ్వింది.

బతుకులో ఇంత మానసిక క్షోభ మళ్ళా కలగలేదు కానీ, గుండె నిండా ఆక్రోశంతో అర్థించి నపుడు, మరో అనంతయ్య కనబడేవాడు. అతడే ఆ మూడో మనిషి!

***

తన కథంతా విన్పించి, "నీ కెప్పుడూ ఈ మూడో మనిషితో పరిచయం కాలేదా?" అని అడిగాడు రమాకాంతం.

"ఇప్పుడు నువ్వు చెప్తుంటే అతడేనా ఆ మూడో మనిషి అనిపిస్తోంది. నిజమే, నీ అనంతయ్యను నేనూ చూశాను. దేవుండి గుళ్ళోకాదు నువ్వు చెప్పిన అనంతుడిని చూసింది, మనుషుల్లో" అన్నాడు వరదరాజన్, ఏదో లోకంలో నుండి మాట్లాడుతున్నట్లు.

"నన్నెప్పుడూ ఓ సందేహం వేధించేది. అనంతయ్య తన తప్పు లేకుండా పెద్ద శిక్ష అనుభవించాడు. నేను తప్పు చేసీ ఏ శిక్షకూ గురవలేదు. ఎందుకంటావు?"

"కర్మ తప్పింపరానిది. ఇట్స్ ఇనెగ్జోరబుల్. నువ్వూ అనుభవించావు కర్మఫలం. అసలు అనంతయ్య అన్నవాడు ఉన్నాడో లేదో మనకు తెలియదు. అతడు సత్యమే అయితే, అప్పుడు నీ అనంతయ్య జంతు దశలో ఉన్నాడు. చెల్లెలి పెళ్ళికోసం తండ్రి దాచిన డబ్బును

కాజేశాడు. అప్పుడతనికి స్వసుఖమే పరమ లక్ష్యం. అలాంటి వ్యక్తికి భౌతికమయిన బాధ కలిగితేనే తెలిసి వస్తుంది. అనంతయ్య తన కర్మ ఫలితాన్ని భార్య విషయంలో అనుభవించాడు. నువ్వు స్వయంగా తప్పు చెయ్యలేదు. పరోక్షంగా అందుకు అనుమతించావు. నీది మానవ తప్పిదపు దశ. నువ్వందుకే కర్మ ఫలితాన్ని మానసిక క్షోభలో అనుభవించావు. షేక్స్పియర్ నాటకాలు చదివావా? రఫ్ కారెక్టర్లకు ఆయన శారీరక శిక్ష, రిఫైన్డ్ కారెక్టర్లకు మానసిక శిక్షా విధిస్తాడు. రిచర్డ్ హాడ్లీ ఛేజ్ నవలలు చదువు, నీకు తెలుస్తుంది. గొప్ప రచయితలకూ ఆ దివ్య జీవనం ఏ మేరలోనో దృశ్యమానమవుతుంది. దాన్నే వాళ్ళు తమ రచనల్లో ప్రతిఫలింప చేస్తారు. ఏమయినా, మనం జీవితంలో మహా విపత్కర పరిస్థితిలో మూడో మనిషిని చూస్తాం. అతడు మనకు సాయం చెయ్య వస్తాడు. కొంతమంది గుర్తించవచ్చు, కొంతమంది గుర్తించ లేక పోవచ్చు" అన్నాడు వరదరాజన్.

*ఆంధ్రభూమి (దినపత్రిక) ఆదివారం 14 జూన్ 2009.*

*ఆంధ్రభూమి దినపత్రిక నిర్వహించిన 2009 ఉగాది కథల పోటీలో మూడవ బహుమతి పొందిన కథ.*